# అహ్మదియ్య జమాఅత్
# పదవిదారుల బాధ్యతలు

**జుమా ప్రసంగము**

సయ్యిద్నా హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్
ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్
అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్
(15 జూలై 2016-మస్జిద్ బైతుల్ ఫుతూహ్ మోర్డన్ లండన్)

ప్రచురణ
నజారత్ ఉల్యా
సదర్ అన్జుమన్ అహ్మదియ్య ఖాదియాన్

# అహ్మదియ్యా జమాఅత్ పదవిదారుల బాధ్యతలు

**జుమా ప్రసంగము**

**సయ్యద్నా హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్**

**ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్**

**అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్**

**(15 జూలై 2016-మస్జిద్ బైతుల్ ఫుతూహ్ మోర్డన్ లండన్)**

అనువాదము: హాఫిజ్ సయ్యద్ రసూల్ నియాజ్

ప్రచురణ

**నజారత్ ఉల్యా సదర్ అన్జుమన్ అహ్మదియ్యా**

**ఖాదియాన్**

**Ahmadiyya Jama'at Padavidarula Badhyatalu**

Telugu Rendering of

**Uhdedaaraan ki Zimmedariyan**

Friday Sermon 15 July 2016 Urdu

By

Hazrat Mirza Masroor Ahmad

Khalifatul Masih V aba

Translated from Urdu into Telugu By

Hafiz Syed Rasool Niyaz

1st Telugu Edition Published : April 2017

Copies : 500

Published By : Nazarat Ulia ,
Sadr Anjuman Ahmadiyya
Qadian, Dist: Gurdaspur,
Punjab, India,143516

Printed at : Fazl-e-Umar Printing Press
Harchowal Road Qadian

ఇతర వివరములకు సంప్రదించగలరు

www.alislam.org

www.ahmadiyyamuslimjamaat.in

Toll Free No: 1800-3010-2131

بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ

نحمدہٗ ونصلی علیٰ رسولہ الکریم وعلیٰ عبدہ المسیح الموعود

☼ అమీర్లు, సదర్లు, ఇతర పదవిదారులు, ముబల్లిఘీన్లకు చాలా ముఖ్యమైన సూచనలు.

☼ జమాఅత్ పనుల బాధ్యతలు మోయుచున్నవారిలో ఒక ప్రత్యేకత యుండవలెను. అనగా వారు సదా సత్యమే పలుకవలెను, తమ దైవభీతి ప్రామాణికమును పెంచుకొంటూ తమ పనిని నిర్వర్తించవలెను.

☼ సంస్కరణ శాఖ క్రియాశీలకమైనచో ఇతర శాఖలు వాటంతటవే క్రియాశీలకమగును.

☼ సంస్కరణ కార్యమును మొదట తమ గృహము నుండి ప్రారంభించుము. ఈ గృహము సంస్కరణ కార్యదర్శి గృహము మాత్రమే కాదు కార్యవర్గములోని ప్రతి సభ్యుని గృహము. అందరి కంటే ఎక్కువ కార్యవర్గము తమను తాము సంస్కరించుకొనవలెను. అమీర్ జమాఅత్, సదర్ జమాఅత్, సంస్కరణ కార్యదర్శి ఏ కార్యక్రమము నిర్వహించినా తమ కార్యవర్గము ఆయా కార్యక్రమాలను పాటించుచున్నదా లేదా అని మొదట గమనించవలెను. అల్లాహ్ తఆలా ప్రాథమిక ఆదేశములు, మానవ జన్మ ఉద్దేశమును కార్యవర్గములోని

ప్రతి సభ్యుడు పాటించుచున్నాడా లేదా ?

☼ అల్లాహ్ తఆలా హక్కులలోని అన్నిటి కంటే పెద్ద హక్కు ఆరాధన. ఇందుకు నమాజ్‌ను అలవర్చుకొమ్మని పురుషులకు ఆదేశము గలదు. నమాజులను అలవర్చుకొనుట అనగా సామూహికంగా నమాజ్ సలుపుటయే. కనుక అమీర్లు, సదర్లు, పదవిదారులు తమ నమాజులను రక్షించుకొని దానిని అలవర్చుకొనుటకు, సామూహికంగా సలుపుట సాధ్యమైనంత వరకు కృషి చేయవలెను. మన ప్రతి పదవిదారునికి సామూహిక నమాజ్ సలుపే జ్ఞానము యుండవలెను. లేనిచో పవిత్ర ఖుర్ఆన్‌లో పదే పదే ఆదేశించబడిన న్యాసముల హక్కు చెల్లించలేరు.

☼ ఇవే కాక ఇంకా మరికొన్ని విషయముల పట్ల పదవిదారులు దృష్టి చూపవలెను. ప్రజల హక్కులు, జమాఅత్ సభ్యులతో పదవిదారులు వ్యవహరించు తీరునకు ఆ విషయములు సంబంధించినవి.

☼ మరొక లక్షణము అనగా నిరాడంబరత, వినమ్రత పదవిదారులలో ప్రత్యేకంగా యుండవలెను.

☼ తమ తమ పరిధిలోని విధులను అర్థము చేసుకొనుటకు పదవిదారులు నియమ, నిబంధనలను తప్పక పఠించవలెను.

☼ తమ సిబ్బంది పట్ల సత్ప్రవర్తనతో వ్యవహరించు విశిష్టత కూడ పదవిదారులలో యుండవలెను.

☼ జమాఅత్ కార్యములను నా అనుభవము, నా విద్య నడిపించుచున్నదని లేదా నా అనుభవము, విద్య జమాఅత్ కార్యములను నడిపించగలదని ఎవరి హృదయములో ఆలోచన రాకూడదు. జమాఅత్ కార్యములను అల్లాహ్ తఆలా అనుగ్రహమే నడిపించుచున్నది.

☼ మరొక లక్షణము అనగా చిరునవ్వు, మంచి ప్రవర్తనతో స్పందించు అలవాటు కూడ పదవిదారులలో యుండవలెను.

☼ ప్రజలకు సౌకర్యము కలిగించే పద్ధతిని ఆలోచించుట పదవిదారులు అనగా ప్రత్యేకంగా అమీర్లు, సదర్లు, సంస్కరణ శాఖలు, నిర్ణయాధికారుల సంస్థల కర్తవ్యము. కాని అల్లాహ్ తఆలా ఆదేశముల పరిధిని దాటకుండా ఈ పద్ధతిని అవలంభించవలెను.

☼ కేంద్రము నుండి వెలువడిన మార్గదర్శకాలను లేదా వచ్చిన సర్క్యులర్లను సత్వరమే పూర్తి శ్రద్ధతో పాటించుట, తమ జమాఅతుల ద్వారా పాటింపజేయుట అమీర్ల, సదర్ల, జమాఅత్ కార్యదర్శుల ముఖ్యమైన బాధ్యత.

☼ వసియ్యత్ చేసిన వారు గుర్తుంచుకోవలసిన మొట్ట మొదటి విషయమేమనగా తమ చందాను క్రమం తప్పకుండా చెల్లించవలెను. అనంతరం తన చందా చెల్లింపులను భద్రపరచుకొనుట ప్రతి మూసీ బాధ్యత. అయినను కేంద్ర కార్యాలయము, సంబంధిత కార్యదర్శులు కూడ ప్రతి మూసీ లెక్కలను పూర్తి చేసి యుంచవలెను. అవసరమొచ్చినప్పుడు వారి చందాల పరిస్థితిని వారికి గుర్తు చేయించవలెను. ప్రతి మూసీతో కార్యదర్శులకు సంబంధములు యుండేటట్లు స్థానిక జమాఅతుల కార్యదర్శులను క్రియాశీలకం చేయుట జాతీయ జమాఅత్ కర్తవ్యము.

☼ రాబోవు మూడు సంవత్సరముల కొరకు సేవ చేయు అవకాశము అల్లాహ్ తఆలా తమకు ఇచ్చినందున తమ సంపూర్ణ శక్తి సామర్థ్యములతో అధికాధికముగా సేవ చేయుటకు, తమ ప్రతి మాట, కార్యము ద్వారా జమాఅత్‌లో ఆదర్శవంతమగుటకు అల్లాహ్ తఆలా అనుగ్రహించుగాక!

సయ్యిద్నా హజ్రత్ అమీరుల్ మొమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్
15 జూలై 2016 (15 వఫా 1395 హిజ్రి షంసి) తేదీన మస్జిద్ బైతుల్ ఫుతూహ్, మోర్డన్, లండన్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللهُ وَحْدَهٗ لَا شَرِيكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ
أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ - بِسْمِ اللهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ
اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعَالَمِيْنَ ـ اَلرَّحْمٰنِ الرَّحِيْمِ ـ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ـ
اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ ـ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ـ
صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ـ

ఇది జమాఅత్ పదవిదారుల ఎన్నికల సంవత్సరమని నేను కొన్ని రోజుల క్రితమే ఒక ఖుత్బాలో ప్రస్తావించియుంటిని. ఇప్పుడు అనేక చోట్ల ఎన్నికలు ముగిసినవి. జాతీయ స్థాయిలో కూడ, స్థానిక జమాఅతులలో కూడ నూతన పదవిదారులు తమ బాధ్యతలను స్వీకరించారు. కొన్ని ప్రాంతాలలో పదవిదారులలోని కొందరు అమీర్లుగా, సదర్లుగా ఇంకా మరి కొందరు ఇతర పదవిదారులు నూతనంగా ఎన్నుకోబడ్డారు. కాని చాలా ప్రాంతాలలో గతములో పని చేయుచున్న వారే మరల పదవిదారులుగా ఎన్నుకోబడిరి. జమాఅత్ సేవ కొరకు తమను అల్లాహ్ తఆలా ఎన్నుకొన్నాడని భావించి క్రొత్తగా ఎన్నికైన వారు అల్లాహ్ తఆలాకు కృతజ్ఞతలు తెలుపుచు అతని ఆస్థానములో మోకరిల్లుచు, తమకు అప్పగించబడిన పదవి హక్కులను వినయముతో చెల్లించుటకు అవకాశం కల్పించవలెనని అల్లాహ్ తఆలాతో సహాయము

యాచించవలెను. మరల ఎన్నుకోబడిన పదవిదారులు కూడ మరల సేవచేయు అవకాశమును అల్లాహ్ తఆలా కల్పించినందునకు కృతజ్ఞతలు తెలుపుచు, పూర్తి సామర్థ్యములతో పదవుల హక్కు చెల్లించుటకు అవకాశంను కల్పించమని దుఃఆలు చేయుచుండాలి. గత సేవలో తమచే దొర్లిన లోపములు, అలసత్వములు, నిర్లక్ష్యముల వలన పదవుల హక్కు చెల్లించలేక పోయినందున అల్లాహ్ తఆలా క్షమించుగాక!. తన శుభములను చేకూర్చుతు రాబోవు మూడు సంవత్సరముల కొరకు మరల మీకు సేవ చేయు భాగ్యమును అనుగ్రహించినందున, తమకు అప్పగించబడిన భాధ్యతలలో లోపములు, అలసత్వములు, నిర్లక్ష్యములు దొర్లకుండా, ఆయా పదవుల హక్కు చెల్లించు శక్తులను అనుగ్రహించు గాక!.

జమాఅత్ సేవను సాధారణ సేవ, సామాన్యమైన విషయములలో పరిగణించకూడదని మీరు గుర్తుంచుకోవలెను. మనలో ప్రతి ఒక్కరు వారు పదవి దారులైనను లేదా సాధారణ అహ్మదీయులైనను ధర్మమునకు ప్రపంచముపై ప్రాధాన్యత నిచ్చెదనని ప్రతిజ్ఞ చేసియున్నారు. ఒక వ్యక్తిని ధార్మిక సేవకై, లేదా మరేదైన ప్రత్యేక సేవకై పదవిదారులుగా ఎన్నుకోబడినప్పుడు, లేదా నియమించబడినప్పుడు ఆ సేవలను ఇతరుల కన్న ఎక్కువ శ్రద్ధతో కొనసాగించవలసిన బాధ్యత పదవి దారులపై గలదు. వారు అల్లాహ్ తఆలాతో ఈ ప్రతిజ్ఞ చేశారని గుర్తుంచుకోవలెను. తమ ప్రతిజ్ఞలను తప్పకుండా నెరవేర్చవలెనని అల్లాహ్ తఆలా పవిత్ర ఖుర్ఆన్‌లో అనేక చోట్ల ఆదేశించాడు. మీరు స్వీకరించిన, మీకు అప్పగించిన ఈ పదవులు ప్రతిజ్ఞలని అల్లాహ్ తఆలా స్పష్టముగా తెలిపిన విషయమును మీరు సదా గుర్తుంచుకొనుము. కనుక తమ పదవులను, ప్రతిజ్ఞలను నిర్వర్తించుము. ఒక చోట అల్లాహ్ తఆలా తమ మాట ప్రకారము నడిచేవారి చిహ్నాము గురించి ఇట్లు తెలిపెను. وَالْمُوْفُوْنَ بِعَهْدِهِمْ اِذَا عٰهَدُوْا (అల్ బఖరహ్:178) అనగా వాగ్దానములు చేసినప్పుడు తమ వాగ్దానములను నిర్వర్తించువారు.

ఇదొక ప్రత్యేక గుర్తింపుగా యుండవలెను. జమాఅత్ కార్యముల

నిర్వహకులు ప్రత్యేకముగా సదా నిష్టాపరతపై నిలుచుచు, తమ నిష్టాపరత స్థాయిని పెంచుకొంటూ తమ కార్యమును నిర్వర్తించవలెను. వారి సత్య స్థాయిలో ఏమాత్రం తగ్గుదల యున్నను, లోపమున్నను వారి నిష్టాపరత స్థాయి జమాఅత్‌కు చెందిన ఒక సాధారణ వ్యక్తికి ఆదర్శం కానిచో వారు తమ ప్రతిజ్ఞ, తమ పదవుల, తమ న్యాసముల హక్కు చెల్లించు వైపు శ్రద్ధ వహించడం లేదని స్పష్టమగును.

కనుక అమీర్లు, సదర్లు తమ కార్యవర్గము కొరకు, జమాఅత్ సభ్యుల కొరకు ప్రథమంగా తాము ఆదర్శముగా నిలువవలెను.

సంస్కరణ (తర్బియత్) కార్యదర్శులున్నారు. సంస్కరణ కార్యము వీరికి అప్పగించబడెను. ఆదర్శములు ఏర్పడినప్పుడే సంస్కరణ కార్యము ఉత్తమముగా కొనసాగును. సేవకులు, బాధ్యులు ఇతరులకు ఉపదేశములు చేయువారు స్వయముగా ఆచరించి చూపవలెను. జమాఅత్ సంస్కరణ బాధ్యత తమకు అప్పగించబడినందున సంస్కరణ కార్యదర్శులు జమాఅత్ సభ్యులకు ఆదర్శముగా నిలువవలెను.

సంస్కరణ శాఖ క్రియాశీలకం అయినచో ఇతర శాఖల కార్యములు వాటంతటవే కొనసాగుచుండునని నేనింతకు ముందు అనేక సార్లు తెలిపితిని. జమాఅత్ సభ్యుల సంస్కరణ స్థాయి ఎంత గొప్పగా యుండునో అంతే సులభముగా ఇతర శాఖల కార్యములు కొనసాగును. సాధారణ వ్యవహారముల (ఉమూరె ఆమ్మ) కార్యదర్శి పని సులభమగును. ప్రచార కార్యదర్శి పని సులభమగును. ఇదే విధముగా ఇతర శాఖల, న్యాయ విభాగ పని సులభమగును.

సంస్కరణ కార్యమును మొదట తమ గృహముల నుండి ప్రారంభించవలెనని నేను తరచుగా కార్యవర్గ సమావేశములలో ప్రస్తావించుచుంటాను. కేవలం తర్బియత్ కార్యదర్శి గృహము మాత్రమే గాక కార్యవర్గ సభ్యుల ప్రతి ఒక్కరి గృహము ఇందులో అంతర్భాగమే. అన్నిటికంటే ముఖ్యముగా కార్యవర్గము తమను తాము సంస్కరించు కోవలెను. జమాఅత్ అమీర్/సదర్, తర్బియత్ కార్యదర్శి ఏ కార్యక్రమము నిర్వహించినా తమ కార్యవర్గము వాటిని పాటించుచున్నదా? లేదా ?

అని ముందుగా గమనించవలెను. అల్లాహ్ తఆలా ప్రాథమిక ఆదేశములు, మానవ జన్మ ఉద్దేశమును కార్యవర్గ సభ్యులు పాటించుచున్నారా? లేనిచో నిష్టాపరత లేదని గ్రహించవలెను.

అల్లాహ్ తఆలా హక్కులలో అన్నిటి కంటే పెద్ద హక్కు ప్రార్థన. ఆ హక్కు చెల్లించుటకై నమాజులను స్థాపించాలని, సామూహిక నమాజ్‌లు సలుపుటకు ప్రయత్నించవలెనని పురుషులను ఆదేశించడమైనది. తద్వారా మన మస్జిదులు, నమాజ్ కేంద్రములు ఆవాసం పొందుటయే గాక అల్లాహ్ తఆలా శుభములను కూడ మనము పొందు వారమగుదుము. తమ ఆచరణాత్మక ఆదర్శముతో జమాఅత్ సభ్యులను కూడ సంస్కరించు వారమగుదుము. అల్లాహ్ తఆలా అనుగ్రహములకు వారసులమగుదుము. వారి కార్యములలో కూడ సౌలభ్యము కలుగును. కేవలం మాటలకే పరిమితం కాకుండా, తమ మాటలు, తమ కార్యాచరణలు ఎంత మేరకు సమానంగా యున్నవో బాధ్యత గల వారు ముందుగా ఆత్మ పరిశీలన చేసుకోవలెను. అల్లాహ్ తఆలా ఇట్లనెను. يَاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوْا لِمَ تَقُوْلُوْنَ مَا لَا تَفْعَلُوْنَ (అస్సఫ్: 3) అనగా ఓ విశ్వాసులారా! మీరు ఆచరించని వాటిని ఎందుకు ఆదేశించెదరు ? "ప్రపంచములో ఆదేశించి ఆచరించని వారుండిరి, యున్నారు, యుందురని ఈ సూక్తి తెలుపుచున్నదని" హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అనిరి. "స్వచ్ఛత లేని హృదయము, ఆచరణ శక్తి లేని మానవుని సంభాషణలు ప్రభావము చూపవని నేను తెలిపిన విషయమును మీరు వినుము, గట్టిగా గుర్తుంచుకొనుము".

*(మల్ఫూజాత్ సంపుటి 1, పుట 67. ఎడిషన్ 1985, లండన్)*

మరల ఇట్లనిరి. "ఆచరించకుండా కేవలం నోటి మాటలకే, పదాలకే పరిమితమైనచో ఎలాంటి ప్రయోజనం చేకూరదు", మరల ఇట్లనిరి "కేవలం ఒట్టి మాటలకు అల్లాహ్ సన్నిధిలో ఎలాంటి ప్రాధాన్యత యుండదు".

*(మల్ఫూజాత్ సంపుటి 1, పుట 77. ఎడిషన్ 1985, లండన్)*

ఆచరణ లేకుండా ఒక వేళ కేవలం మాటలకే పరిమితమైనచో అల్లాహ్ దృష్టిలో ఆ వ్యక్తికి ఎలాంటి ప్రాముఖ్యత ఉండదు.

కావున హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అల్లాహ్ తాలా ఆదేశములను విపులీకరించి మన ముందు ప్రస్తావించారు. అవేమనగా మన మాట, కార్యములో వ్యత్యాసముండకూడదు. అన్నిటి కంటే ఎక్కువగా ఈ విషయమును మన పదవిదారులు తమ దృష్టియందుంచు కోవలెను.

దూరము ఎక్కువగా యున్న చోట, తక్కువ గృహములు యున్న చోట, మస్జిదులు లేని చోట, నమాజ్ కేంద్రములు లేని చోట గృహములలో నమాజులు సలుపు ఏర్పాటు చేయవచ్చును. ఆచరణలో ఇది కష్టమేమి కాదు. అహ్మదీయులలో అనేకులు గృహములలో నమాజ్‌లు సలుపుతారు. వారు అధికారికంగా జమాఅత్ సేవలు నిర్వహించే వారు కాదు, వారు కార్యవర్గ సభ్యులు అంతకన్న కారు. అయినను తమ గృహములలో వారి చుట్టు గల అహ్మదీయులను ప్రోగు చేసుకొని సామూహిక ప్రార్ధనలు సలుపుచుందురు. ఆలోచన ఉన్నచో అసాధ్యమనేది ఏమియు యుండదు. మన పదవి దారులందరిలో సామూహిక ప్రార్ధనలను సలుపు ఆలోచనలు తప్పకుండా ఉండవలెను. అలా కానిచో తమ న్యాసములను చెల్లించువారని అనబడలేరు. వాస్తవానికి పవిత్ర ఖుర్ఆన్ న్యాసములు చెల్లించమని పదే పదే ఆదేశిస్తున్నది.

కావున తమ న్యాసములను చెల్లించు, వాగ్దానములను నెరవేర్చుటకు ప్రయత్నించుటయే, వాటిపై ప్రత్యేక శ్రద్ధను కనబరచుటయే ఒక స్వచ్ఛమైన విశ్వాసి లక్షణం అని అల్లాహ్ తఆలా తెలిపినట్లు పదవి దారులందరు గుర్తుంచుకోవలెను. మాకు అప్పగించిన బాధ్యతలను లేదా సేవలు చేయుదుమని వారు చేసిన వాగ్దానములను నెరవేర్చుటలో ఏమైన లోపాలున్నాయా?, లేక మనమే నిర్లక్ష్యము వహించుచున్నామా? అని పరిశీలించుకోవలెను. ఎందుకనగా ఇది సాధారణ విషయం కాదు. అల్లాహ్ తఆలా పవిత్ర ఖుర్ఆన్‌లో తెలిపినట్లు إِنَّ الْعَهْدَ كَانَ مَسْئُولًا (బనీ ఇస్రాయీల్:35) అనగా ప్రతి వాగ్దానమునకు ఏదో ఒక రోజున సమాధానం ఇవ్వవలసి యుండును. ప్రార్ధనలు ఒక ప్రాథమిక అంశం. మానవుని జన్మోద్దేశము కూడ ఇదియే. ఈ హక్కును మనము చెల్లించవలెను. పదవిదారులు ప్రత్యేకముగా ఇందులో ఎలాంటి

అలసత్వము చూపకూడదు. వాస్తవానికి నిజమైన ఏ విశ్వాసి కూడ అలసత్వము వహించకూడదు.

ఇవియే కాకుండా ప్రజల హక్కులను నెరవేర్చు విషయములను గూర్చి, జమాఅత్ సభ్యులతో పదవిదారులు ఏ విధముగా ప్రవర్తించవలెను? అదే విధముగా పదవిదారుల బాధ్యతలను గూర్చి ప్రత్యేకంగా వారికి తెలుపుట కూడ ముఖ్యమే.

ఏ పదవిదారుడు కూడ అధికారి కావలెననే ఆలోచనతో, లేదా అధికారిగా ఎన్నుకొందురనే భావనతో ఏదేని పదవికి నియమించబడడు. ఇస్లాంలో పదవిదారుని భావనే భిన్నముగా యుండును. ఆః హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం వారిని "జాతి నాయకుడు, జాతి సేవకుడని" తెలిపారు.

(కన్‌జుల్ వుమ్మాల్, కితాబుస్సఫర్, అల్ ఫస్లుస్సాని ఫీ ఆదాబిస్సఫర్ సంపుటి 6, పుట 302. హదీస్ 17513. ప్రచురణ అల్ కుతుబుల్ ఇల్మియ్యహ్ బేరూత్ 2004)

కావున ఒక పదవి దారుడు తన న్యాసముల హక్కులను చెల్లించు విషయంలో అతని జాతికి అతడు సేవకుడై యుండును. కేవలం మానవునిలో త్యాగస్ఫూర్తి ఉన్నప్పుడే ఈ స్థితి ఏర్పడుతుంది. అతనిలో వినయ విధేయతలు ఉండవలెను. ఇతరుల సహన ప్రామాణికం కన్న పదవి దారుల సహన ప్రామాణికం అధికంగా ఉండవలెను. కొన్ని సార్లు పదవి దారులకు కొన్ని మాటలు వినవలసి వచ్చును. వినవలసి వచ్చినచో వినవలెను. తమ ఓర్పు స్థాయి ఎంత వరకున్నదో, తమ వినయ స్థాయి ఎంత యున్నదో పదవి దారులు స్వయముగా పరిశీలించుకోవచ్చును. కొన్ని సందర్భాలలో పదవి దారులలో కొందరికి ఏ మాత్రం ఓర్పు లేదనే విషయం బయట పడుతుంది. ఎవరైనా అమర్యాదగా వ్యవహరించినచో వీరు కూడ కోపమును ప్రదర్శించెదరు. ఒక వేళ ఒక సాధారణ పౌరుడు అమర్యాదగా ప్రవర్తించినచో అతనికి ఎలాంటి నష్టము వాటిల్లదు. అతనిని గూర్చి అమర్యాదస్థుడని మాత్రమే అందురు. అతనిని గుణహీనుడందురు. కాని ఒక పదవి దారుని నోటి నుండి పొరపాటున కూడ ఏమైనా అసభ్యకర

పదాలు ఉచ్చరించబడినచో ఆ పదవి దారుని గౌరవ ప్రతిష్టలకే భంగం వాటిల్లును. అంతేగాకా జమాఅత్ సభ్యులపై కూడ చెడు ప్రభావం పడును. జమాఅత్ ప్రామాణికం, లేదా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం జమాఅత్‌ను ఏ ప్రామాణికంపై చూడాలనుకున్నారో ఆ ప్రామాణికంలో రవ్వంత తగ్గుదల ఏర్పడినను జమాఅత్‌కు చెడ్డ పేరు వచ్చే అవకాశములు అధికంగా యుండును లేదా చెడ్డ పేరు వచ్చును. కొన్ని ప్రాంతాలలో ఇట్టి ఉదాహరణలు కూడ లభించును. కొందరు మస్జిదులలో కూడ తగాదాలకు పాల్పడుదురు. ఈ విషయములు బాలలలో, యువకులలో దుష్ప్రభావమును చూపును.

అల్లాహ్ తఆలా మన నుండి ఏమి ఆశించుచున్నాడు ? త్యాగాలు చేయువారి కీర్తిని అల్లాహ్ తఆలా ఏ విధముగా కొనియాడుచున్నాడో దానిని ఒక చోట వివరించుచు وَيُؤْثِرُوْنَ عَلٰٓى أَنْفُسِهِمْ (హషర్:10) అని తెలిపెను. అనగా ఒక విశ్వాసి తన వ్యక్తిత్వంపై తన ధార్మిక సోదరునికి అధిక ప్రాధాన్యత నిచ్చును. అన్సారులు (మదీన స్థానికులు) ముహాజిరీనుల (మక్కా నుండి వలస వచ్చిన వారి) విషయములో ఈ ఉదాహరణలను నెలకొల్పిరి. ఇదియే మనకు అత్యుత్తమ ఉదాహరణ ప్రామాణికం. కొందరు ఇతరుల హక్కులను చెల్లించుట ఏమో గాని, కొన్ని సందర్భాలలో వారి హక్కులనే పూర్తి స్థాయిలో నెరవేర్చలేక పోతారు. కొన్ని వ్యవహారములలో నివేదిక పంపవలెనని పదవి దారులకు కేంద్రము నుండి ఆదేశాలు పంపబడినప్పుడు వ్యవహారముల గురించి నిర్లక్ష్యముగా నివేదిక పంపుతారు. సరియైన రీతిలో పరిశోధించరు. లేదా నివేదిక పంపబడదు. లేదా సమస్యను ఆలస్యము చేయుదురు. తద్వారా అవసరమున్న ఒక వ్యక్తి అవసరము పూర్తి అగుటకు దరఖాస్తు ఇచ్చినచో సమయమున అతని అవసరము తీరనందున అతనికి నష్టము కలుగును లేదా అతను బాధను భరించవలసి వచ్చును. కొందరు పదవి దారులు తమ పని భారమును సాకుగా చూపుతారు. కొందరి వద్ద ఎలాంటి సాకు యుండకున్నను నిర్లక్ష్యము వహింతురు. కాని వారి స్వంత పనులైనచో లేదా సమీపుల పని అయినచో ప్రాధాన్యతలు మారిపోతాయి.

నిజమైన సేవా దృక్పథము, త్యాగ స్ఫూర్తి, తమ పదవి సరియైన హక్కును చెల్లించుట అనగా ఒక వ్యాకులతతో ఇతరులకు సహాయము నందించడమే. ఇతరులకు ఉపయోగపడడమే. ఇట్టి త్యాగ స్ఫూర్తితో ఇతరుల బాధలను తమ బాధలుగా భావించి పని చేసినప్పుడు జమాఅత్ సభ్యుల త్యాగస్థాయి కూడ రెట్టింపగును. ఒకరు మరొకరి హక్కులను హరించే బదులు, ఇతరుల హక్కులు చెల్లించుటకు ముందుకు వచ్చెదరు. అన్ని స్థాయిలలో హక్కులు హరించే బదులు హక్కులు చెల్లించే స్ఫూర్తి, త్యాగము ఏర్పడినప్పుడే ప్రపంచములో శాంతి ఏర్పడునని మనము ఇతరుల ముందు ఉపన్యసిస్తాము. కాని మనలో ఈ ప్రామాణిక స్థాయి లేనప్పుడు అల్లాహ్ తఆలాకు ఇష్టము లేని పని చేసిన వారమగుదుము.

పదవి దారులలో ప్రత్యేకముగా యుండవలసిన మరో లక్షణము వినయము. అల్లాహ్ తఆలా ఒక స్వచ్ఛమైన భక్తుడి చిహ్నామును يَمْشُوْنَ عَلَى الْاَرْضِ هَوْنًا (అల్ ఫుర్ఖాన్: 64) అనగా వారు భూమిపై వినయంతో నడుచుదురని తెలిపెను. కావున ఈ వినయంలో కూడ మన పదవి దారులు ఉన్నత ప్రామాణికాన్ని నెలకొల్పి చూపాలి. ఒక పదవి దారుడు ఎంత పెద్ద బాధ్యతను నెరవేర్చునో, అంతే ఎక్కువ వినయంను వారు ప్రజల విషయంలో ప్రదర్శించ వలసి యుండును. దీనినే పెద్దరికం అందురు. పదవి దారుల ప్రవర్తన ఎలా ఉన్నదని ప్రజలు గమనిస్తూనే ఉంటారు, అనుభవిస్తూనే ఉంటారు. ఒక పదవి దారుడు గతంలో ఇలా ఉండేవాడు, కాని అతను పదవి చేపట్టిన తరువాత నేడు నాకు సలామ్ చేయడమే గాకా, నా స్థితిగతులను కూడ అడిగి తెలుసుకున్నాడు. నా పట్ల చాలా మర్యాదను కనబర్చారు. వారి ఈ చర్య వలన నాకు చాలా సంతోషం కలిగినది, అంతేగాకా వారి పెద్దరికం కూడ తెలిసినదని కొందరు నాకు ఉత్తరములు వ్రాస్తుంటారు.

కావున తెలుసుకోవలసిన విషయమేమనగా జమాఅత్ సభ్యులలో అనేకులు పదవి దారుల ప్రేమానురాగాలు, ఆప్యాయత అనుబంధాల వల్లనే సంతోషపడి అన్ని రకాల త్యాగాలకు సిద్ధమవుతుంటారు. కాని ఒకవేళ ఎవరేని పదవి దారుని హృదయములో తమ పదవి వలన ఏ

విధమైన గర్వము గాని, అహంకారము గాని ఏర్పడినచో ఈ విషయము అల్లాహ్ తఆలా నుండి అతన్ని దూరము చేయునని అతడు గుర్తుంచు కోవలెను. మానవుడు అల్లాహ్ తఆలా నుండి దూరమైనప్పుడు అతని కార్యములో శుభములు కలుగవు. ధార్మిక కార్యములు ఎల్లప్పుడు అల్లాహ్ ప్రీతి కొరకే చేపట్టవలెను. ఒక వేళ అతని లక్ష్యము అల్లాహ్ ప్రీతి కానప్పుడు అట్టి వ్యక్తి జమాఅత్‌కు ప్రయోజనము చేకూర్చుటకు బదులు నష్టమును చేకూర్చిన వాడగును.

కావున పదవి దారులందరు తమలో వినయం ఉన్నదా? లేదా? ఒక వేళ ఉన్నచో ఎంత మేరకు యున్నది? అని ప్రత్యేకంగా పరిశీలించుకోవలెను. హజ్రత్ ముహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు ఉపదేశించిరి. "ఒకరు ఎంతగా వినయ, విధేయతలను ప్రదర్శించెదరో అల్లాహ్ తాలా అతనిని అంత ఉన్నతికి చేర్చును"
*(సహీ ముస్లిం, కితాబుల్ బిర్రి వ స్సలాతి, వల్ ఆదాబ్, బాబ్ ఇస్తిహ్‌బాబుల్ అఫ్వి వత్తవాజియి హదీస్ సంఖ్య 6487)*

కావున ప్రతి పదవిదారుడు గుర్తుంచుకోవలసిన విషయం ఏమిటనగా అల్లాహ్ తఆలా వారికి జమాఅత్‌కు సేవ చేయు భాగ్యము కల్పించి, వారిపై ఉపకారము చేసెను. కావున వారు తమ వినయ, విధేయతలలో మిక్కిలి అభివృద్ధి చెందడమే ఆ ఉపకారమునకు కృతజ్ఞత అగును. ఒకవేళ వినయ, విధేయతలలో అభివృద్ధి చెందనిచో వారు అల్లాహ్ తఆలా ఉపకారమునకు కృతఘ్నులగుదురు.

కొందరు సాధారణ పరిస్థితులలో కలిసినప్పుడు ఎంతో వినయమును చూపెదరు. కాని తమ క్రింది వారితో లేదా ఒక సాధారణ వ్యక్తితో భేదాభిప్రాయము ఏర్పడినప్పుడు వారిలో తక్షణమే తమ అధికార నాడి మేల్కొనును. తాను పెద్ద పదవి దారుడననే ఆలోచన అతనిలో కలిగి, తమ క్రింది స్థాయి వారి పట్ల అహంకార వైఖరిని ప్రదర్శించెదరు. ఇది కృత్రిమ వినయము. తమ క్రింది ఉద్యోగి అభిప్రాయ భేదము వ్యక్తపరచనంత వరకు, తమ ఇష్టమునకు విరుద్ధముగా మాట్లాడనంత వరకు వినయమును ప్రదర్శించడము అసలు వినయం అనబడదు. ఇది

కేవలం కల్పితమైన వినయం అనబడును. భేదాభిప్రాయములు ఏర్పడినప్పుడు, క్రింది స్థాయి ఉద్యోగి తమ కోరికకు భిన్నంగా నడుస్తున్నప్పుడు న్యాయమును అవలంభించి అతని అభిప్రాయముపై క్షుణ్ణంగా ఆలోచించి సరియైన నిర్ణయము తీసుకొన్నప్పుడే వాస్తవమైన వినయం బహిర్గతమగును. ఆ వినయంతో ఉన్నతమైన ఔదార్యము కూడ బహిర్గతమగును. ఇలా జరిగినప్పుడే అది నిజమైన విధేయత అనబడును.

పదవి దారులు ఎల్లప్పుడు అల్లాహ్ తఆలా ఈ ఆదేశములను గుర్తుంచుకోవలెను. وَلَا تُصَعِّرْ خَدَّكَ لِلنَّاسِ وَلَا تَمْشِ فِي الْأَرْضِ مَرَحًا (లుక్మాన్: 19) మీరు ఆవేశంతో ప్రజలపై విరుచుక పడకుము, భూమిపై గర్వంతో నడవకుము.

భేదాభిప్రాయముల అంశమును గూర్చి వివరించుచున్నందున ఇచట మరో విషయమును కూడ నేను మీ ముందు ప్రస్తావించెదను. అదేమనగా కొన్ని సందర్భాలలో కార్యవర్గీయుల అభిప్రాయమును తిరస్కరించుచు అమీర్ జమాఅత్ తన అభిప్రాయము మేరకు తీర్మానం చేయు అధికారమును నియమములు కల్పించినను సాధ్యమైనంత వరకు అందరికి ఆమోదయోగ్యమైన విధానమును అవలంభించుటకు ప్రయత్నించవలెను. సలహాలతో, అధికుల అభిప్రాయముతో ఏకీభవించుచు కార్యములు చేపట్టుటకు ప్రయత్నించవలెను. కొన్ని ప్రాంతాల అమీరులు ఈ అవకాశం నుండి అవసరమునకు మించి ప్రయోజనం పొందుటకు ప్రయత్నించెదరు. ఈ అవకాశమును కేవలం అత్యవసర సమయములో, జమాఅత్ ప్రయోజనాల దృష్ట్యా, సందర్భానుసారంగా కార్య వర్గీయులపై దాని ఆవశ్యకతను వివరించుచు జమాఅత్ ఉజ్వల భవిష్యత్తుకై వినియోగించు కోవలెను. ఇందుకై దుఆల ద్వారా అల్లాహ్ సహాయమును యాచించవలెను. కేవలం తమ వివేకం పైననే ఆధారపడకూడదు. ఈ అవకాశం సదర్ జమాఅత్‌లకు లేదని తెలుసుకోవాలి. కార్య వర్గీయుల అభిప్రాయమును తిరస్కరించుచు తన అభిప్రాయమునే తీర్మాణంగా భావించే హక్కు జాతీయ స్థాయికి చెందిన సదర్‌కు కూడ లేదు. తమ తమ పరిధులను గుర్తుంచుకొనుటకు

పదవిదారులందరు తప్పనిసరిగా నియమ, నిబంధనలను క్షుణ్ణంగా చదివి వాటిని అర్ధం చేసుకోవలెను. ఒకవేళ నియమ, నిబంధనల ప్రకారం ప్రతి ఒక్కరు నడుచుకున్నచో కార్య వర్గీయుల మధ్య లేదా జమాఅత్ సభ్యుల మధ్య ఆందోళన ఏర్పడే చిన్న చిన్న సమస్యలన్నియు వాటికి అవియే దూరమగును.

పదవిదారులలో ఉండవలసిన మరో ప్రత్యేకత ఏమనగా తమ సిబ్బంది పట్ల సత్ప్రవర్తనతో వ్యవహరించుట. జమాఅత్ కార్యములు అధికంగా స్వచ్ఛంద కార్యకర్తలతోనే కొనసాగుతుంటాయి. జమాఅత్ సభ్యులు జమాఅత్ కార్యమునకై సమయమును కేటాయిస్తుంటారు. వారు అల్లాహ్ తఆలా ప్రీతిని పొందుటకే సమయాన్ని కేటాయిస్తారు. వారికి జమాఅత్ పట్ల అనుబంధము, అభిమానం ఉన్నందునే సమయాన్ని కేటాయించుచున్నారు. కావున పదవిదారులు కూడ తమ సహోద్యోగుల మనోభావాలను గౌరవించుచు వారితో సత్ప్రవర్తనతో వ్యవహరించవలెను. ఇదియే అల్లాహ్ తఆలా ఆదేశము.

మరల ఇదే సత్ప్రవర్తనతో తమ ఉపాధికారులకు, సిబ్బందికి పని నేర్పుటకు కూడ కృషి చేయవలెను. తద్వారా జమాఅత్ కార్యములు సవ్యంగా ముందుకు కొనసాగును. జమాఅత్ కార్యములు అల్లాహ్ తఆలాయే చేపట్టుననే విషయంలో ఎలాంటి సంశయం లేదు. కాని అనుభవం కలిగిన అధికారులు, పదవిదారులు ఇతరులకు ఆయా కార్యములను గూర్చిన విధానమును నేర్పించినచో వారికి పుణ్యఫలమే లభించును. అల్లాహ్ తఆలా దయ వలన నాకు గాని, నా ముందు ఖలీఫాలకు గాని జమాఅత్ పనులు ఎలా కొనసాగుననే ఆవేదన ఉండేది కాదు. జమాఅత్ కార్యములను చేపట్టు అనేకులను ఏర్పాటు చేసి అందింతునని ఈ విషయంలో అల్లాహ్ తఆలా హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంతో వాగ్దానం చేశాడు.

*(సేకరణ: బరాహీనె అహ్మదియ్య, రూహానీ ఖజాయిన్ సంపుటి 1 పుట 267 అనుబంధము)*

హ్రజత్ ఖలీఫతుల్ మసీహిస్సాలిస్ (రహ్మ) ఖిలాఫత్ సమయంలో

నా కార్యాచరణ, నా వివేకం వలన జమాఅత్ ఆర్థిక వ్యవస్థ ఉత్తమముగా నడుచుచున్నదని ఒక అధికారి భావించెను. హజ్రత్ ఖలీఫతుల్ మసీహిస్సాలిస్ (రహ్మ) గారికి ఈ విషయము తెలిసినప్పుడు ఆ అధికారిని తొలగించి ఆర్థిక విషయముల అవగాహన లేని వ్యక్తిని ఆ కార్యముపై నియమించిరి. ఇది అల్లాహ్ తఆలా కార్యము అయినందున, వర్తమాన ఖలీఫాతో అల్లాహ్ తఆలాకు సంబంధమున్నందున ఏమియును తెలియని క్రొత్తగా నియమితుడైన ఆ అధికారి పనిలో గతంలో ఎన్నడు ఊహించనంత శుభములు కలిగెను.

పదవిదారులకు అల్లాహ్ తఆలా అవకాశము కల్పించినట్లే ఉద్యోగులకు అల్లాహ్ తఆలా అవకాశము కల్పించును. జమాఅత్, ధార్మిక సేవ చేసి అల్లాహ్ తఆలా శుభములకు వారసులగుటకు అల్లాహ్ తఆలా జీవిత సమర్పితులకు అవకాశము కల్పించును. వాస్తవానికి ఈ పనులను అల్లాహ్ తఆలా స్వయముగా చేస్తున్నాడు. ఇది అతని వాగ్దానము. కనుక నా అనుభవము, నా వివేకం వల్లనే జమాఅత్ పనులు కొనసాగుచున్నవనే ఆలోచన ఎవరికి కలుగకూడదు. జమాఅత్ పనులను అల్లాహ్ తఆలా స్వయంగా నిర్వహించుచున్నాడు. మనమెంత బలహీనులమనగా ఒకవేళ మనము ఏదేని ఒక ప్రాపంచిక కార్యమును చేపట్టదలచినచో, మనము దానిని చేపట్టలేక పోవుదుము. ఆయా కార్యములలో ఉత్తమ ఫలితాలు ఏ మాత్రం లభించవు. కాని ధార్మిక కార్యకలాపాలలో అల్లాహ్ తఆలా మన బలహీనతలను కప్పిపుచ్చుచు, దైవదూతల ద్వారా మనకు సహాయమును అందించుచున్నాడు.

ఇంకా ప్రచార కార్యక్రమాలు గలవు. ఈ కార్య నిర్వాహణకై అల్లాహ్ తఆలా ఈ పాశ్చాత్య దేశములలో పుట్టి, పెరిగిన నవ యువకులను అందించాడు. వారు స్వయంగా ధార్మిక విద్యను నేర్చుకొని, అహ్మదియ్య వ్యతిరేక శక్తుల నోటి మాటలను మూసివేస్తున్నారు. మానవుని మేధస్సు కూడ ఆశ్చర్యమునకు గురయ్యే విధముగా వారికి సమాధానములు ఇస్తున్నారు. ఇంతటి ఘాటైన సమాధానములతో మరో మార్గం లభించని వ్యతిరేకులు ఇలాంటి నవ యువకుల మధ్య నుండి పారిపోవుచున్నారు.

కావున పదవిదారులు ధార్మిక సేవను తమ భాగ్యముగా భావించవలెను. అంతేగాక ఏదేని తమ ప్రత్యేకతల వలన వారికి ఈ అవకాశం లభించలేదని గుర్తుంచుకోవలెను.

చిరునవ్వు, సత్ప్రవర్తనతో వ్యవహరించు మరో లక్షణము కూడ పదవిదారులలో యుండవలెను. అల్లాహ్ తఆలా ఇట్లనెను. وَقُوْلُوْا لِلنَّاسِ حُسْنًا (అల్ బఖరహ్: 84) అనగా సోదర మానవులను దయతో పలుకరించుము. ఇది కూడ ఒక ప్రాథమిక గుణము. పదవి దారులలో ఈ గుణము అధికముగా యుండవలెను. తమతో కలిసి పని చేయుచున్నవారితో, తమ క్రింది సిబ్బందితో మాట్లాడినప్పుడు లేదా ఇతర వ్యక్తులతో మాట్లాడినప్పుడు తమ ఉన్నత సద్గుణములు వెలువడునట్లు చూసుకోవలెను. కొన్ని సందర్భాలలో నిర్వాహణ అధికారులు కఠినంగా వ్యవహరించ వలసి వస్తుంది. కాని ఈ పరిస్థితిని కేవలం అనివార్య సమయములలోనే వినియోగించాలి. ఒకవేళ పదవిదారులు మేము మీ శ్రేయస్సు ఆశించువారమేనని ప్రజలకు ప్రేమతో నచ్చజెప్పి, వారిలో ఆలోచనలను కలిగింప జేసినచో 99% ప్రజలు తప్పకుండా వారిని అర్థం చేసుకుంటారు. వారు జమాఅత్‌తో అనుసంధానమైనందున వారు జమాఅత్‌కు సేవ చేయుటకు ముందుకు వస్తున్నారు. కనుక ప్రజలలో అవగాహన కల్పించుట లేదా మన పదవి దారులు మన శ్రేయస్సు కొరకే శ్రమిస్తున్నారనే భావన కల్గింప జేయుట అన్నింటి కన్న ముఖ్యమైన, ప్రాథమిక విషయం. ప్రజలతో సున్నితంగా వ్యవహరించవలెను. ఎవరితోనైన ఏదైన పొరపాటు జరిగినప్పుడు వారికి వారి పొరపాటును సరిదిద్దుకునే అవకాశం కల్పించకుండా వారిని శిక్షించకూడదు. పదే పదే పొరపాట్లు చేయువారిని, తమ తప్పులను సరిదిద్దుకొనుటకు ప్రయత్నించని వారిని, చిన్న చిన్న విషయాలకే వివాదములకు సిద్ధమయ్యేవారిని శిక్షించాలి. ఇందుకు ముందుగా వారి గురించి పూర్తిగా తెలుసుకోవాలి. అంతేగాకా ఈ కఠినత్వంలో తమ స్వప్రయోజనాలు యుండకూడదు. కేవలం వారి సంస్కరణయే లక్ష్యమై ఉండాలి. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఒక సందర్భమున తాను నియమించిన

యమన్ గవర్నరులను ఉద్దేశించి ఇట్లు ఉపదేశించిరి. "ప్రజలకు సౌకర్యములను కల్పించుము. కష్టములను కలిగించకుము. ప్రేమ, ఆప్యాయతలను వ్యాపింప జేయుము. ద్వేషమును సృష్టించకుము".

*(ముస్నద్ అహ్మద్ బిన్ హంబల్ సంపుటి 6, పుట 638. హదీస్ 19935, ముస్నద్ అబూ మూసా అల్ అష్అరి ప్రచురణ ఆలముల్ కుతుబ్ బేరూత్ 1998 క్రీ.శ.)*

ఇది ఎటువంటి ఉపదేశమనగా పదవిదారుల, జమాఅత్ సభ్యుల మధ్య కూడ సంబంధములలో సౌందర్యమును ఏర్పాటు చేయును. దీని ఫలితముగా పరస్పరము జమాఅత్ సభ్యులలో కూడ ఒకరు మరొకరి భావములను గుర్తించే స్ఫూర్తి ఏర్పడును.

కావున పదవి దారులు, ప్రత్యేకించి అమీర్‌లు, సదర్‌లు, శిక్షణా శాఖ, న్యాయ శాఖ అధికారులు మొ॥ వారందరి ప్రాధమిక భాధ్యత ఏమిటనగా ప్రజలకు సౌకర్యములను కల్పించుటకు ప్రయత్నించవలెను. ఈ సౌకర్యములు కూడ అల్లాహ్ తఆలా ఆదేశములకు అనుగుణంగా కల్పించుటకు మాత్రమే ప్రయత్నించవలెను. ప్రాపంచికుల వలె అల్లాహ్ తఆలా ఆదేశాలను విస్మరించి సౌకర్యములను కల్పించుటకై ప్రయత్నించ కూడదు. మనము అల్లాహ్ తఆలా ప్రీతిని ఆశించుచు, అతని భక్తుల హక్కులను నెరవేర్చుచు, తమ వాగ్దానాలను, తమ న్యాసములను నెరవేర్చుటకై ఎల్లప్పుడు కృషి చేయవలెను.

నేనింతకు ముందే తెలిపినట్లు పదవిదారులందరు నియమ, నిబంధనలను క్షుణ్ణంగా అవగాహన చేసుకొని తమ శాఖల భాధ్యతలను గూర్చి తెలుసుకోవలెను. ప్రతి ఒక్కరికి తమ పరిధి తెలిసి యుండవలెను కొందరు పదవిదారులకు వారి హద్దులు ఎంత వరకు గలవో వారికే తెలిసి యుండదు. ఒక శాఖ వారు తమ అవగాహన లేమితో మరో శాఖకు చెందిన కార్యాచరణను రూపొందించుకొందురు. లేదా అతి సూక్ష్మమైన అంశాలను గూర్చిన అవగాహన లేమి వలన కూడ కొన్ని శాఖలు ఒకే కార్యాచరణను ఆచరించెదరు. ఇలా జరుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

కొన్ని రోజుల క్రితం ఇంగ్లాండ్ కార్యవర్గపు సమావేశంలో నేను పాల్గొన్నాను. ఇరు శాఖలలో పోలికలు గల అతి సూక్ష్మ అంశాలను అర్థం చేసుకోనందునే వారిలో వాదోపవాదములు కొనసాగుచున్నాయని, నేను గ్రహించాను. ఒకవేళ నియమావళిని అధ్యయనం చేసినచో ఇలా అవగాహన లేమితో సమయమును వృథా చేసుకునే వారు కాదు. ఉదా॥ ప్రచార శాఖ భాధ్యతలు ప్రచారమునకై బృందాలను ఏర్పాటు చేయడం, సత్సాంబంధాలు నెలకొల్పడం. సత్సాంబంధాలతోనే ప్రచారం ముందుకు సాగుతుంది. అదే విధముగా ఉమూరే ఖారిజ (బాహ్య వ్యవహారాల శాఖ) వారు కూడ సత్సాంబంధాలను నెలకొల్పి జమాఅత్ పరిచయాలను విస్తరింపవలసి ఉంటుంది. వారిరువురి పరిధులు వేరు వేరుగా ఉండును. ఒకరు ప్రచారం కొరకు కార్యాచరణను రూపొందించవలసి యుండగా, మరొకరు ప్రజలతో సత్సాంబంధాలను నెలకొల్పుటకు, సన్నిహిత్యంను పెంచుటకు కార్యాచరణను ఆచరించవలెను. జమాఅత్ పరిచయాన్ని విస్తరింప జేయుచు, ప్రజలను ధార్మిక విధానాలపై నడిపింప జేయుటయే ఇరు శాఖల ముఖ్యోద్ధేశము. తద్వారా ప్రజలను మనము అల్లాహ్ సన్నిధిలో చేరవేసి, వారి ఇహ, పర లోకములను చక్కదిద్దుటకు ప్రయత్నించుచు ప్రపంచ శాంతిని నెలకొల్పుటకు ప్రయత్నించిన వారమగుదుము. ప్రపంచ బిరుదులు పొందడం మన లక్ష్యము కాదు, కాకూడదు. అల్లాహ్ తఆలాను సంతోషపరచుట, అతని ప్రీతిని పొందుటయే మన ముఖ్య లక్ష్యము కావలెను. కావున శాఖలు పరస్పరం సహకరించుకొంటూ తమ కార్యకలాపాలను నిర్వహించినచో ఎన్నో రెట్లు అధిక ఫలితాలను మనము పొందవచ్చును.

మరల కొన్ని ప్రాంతాలలో వారి శాఖల మధ్య సమన్వయంగా బడ్జెట్‌ను కేటాయించలేదనే విమర్శలు వస్తుంటాయి. కార్యవర్గ సమావేశంలో కేటాయించిన బడ్జెట్ ఆధారంగానే ఆయా శాఖలకు నిధులను కేటాయించాలి. వాటిని ఖర్చు చేయు అధికారము ఆయా శాఖల కార్యదర్శులకు ఉంటుంది. ఆర్థిక శాఖకు చెందిన కార్యదర్శి ప్రణాళిక కూడ కార్యవర్గ సమావేశంలో చర్చించిన పిదపయే అందుకు తగిన

విధముగా ఇతర శాఖల వారు ఖర్చులు చేయాలి. వివిధ శాఖలు తలపెట్టిన కార్యములను ప్రతి కార్యవర్గ సమావేశములలో తప్పకుండా చర్చించాలి. నిర్ధేశిత ప్రణాళికలలో ఏదేని మార్పులు చేయదలచినచో, లేదా మిక్కిలి ప్రయోజనాల దృష్ట్యా కార్యక్రమాలలో మార్పులు చేయదలచినచో ఆయా కార్యక్రమాలపై మరల పునఃపరిశీలన జరపవలెను.

కేంద్రము నుండి అందిన ఆదేశములు లేదా సర్కులర్‌లను వెంటనే స్వయముగా ఆచరించి, జమాఅత్‌ల ద్వారా ఆచరింపజేయుట అమీర్లు, సదర్లు, కార్యదర్శుల ముఖ్య కర్తవ్యము. కేంద్ర ఆదేశములను పూర్తిగా ఆచరించడం లేదని కొన్ని జమాఅత్‌ల గురించి ఫిర్యాదులు అందుచున్నాయి. ఒకవేళ ఏదేని ఆదేశములో తమ ప్రాంతీయ, లేదా జాతీయ స్థాయిలో ఏదైనా అభ్యంతరం ఏర్పడుచున్నచో దానిని వివరించుచు అందులో మార్పుల కోసం మరల కేంద్రమునకు వెంటనే దరఖాస్తు చేసుకోవలెను. ఈ కర్తవ్యం అమీర్ లేదా సదర్ జమాఅత్‌దని వారు గుర్తుంచుకోవలెను. తమ తెలివిని ఉపయోగించుచు ఆ ఆదేశమును ప్రక్కకు పెట్టడం లేదా దానిని పాటించకపోవడం, కేంద్రమునకు కనీసం సమాచారం అందించకపోవడం ఏమాత్రం సమంజసం కాదు. ఇలా చేసినచో ఈ చర్యను ఉల్లంఘనగా పరిగణించుచు ఆయా జమాఅత్ సదర్ లేదా అమీర్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవలసి ఉంటుంది.

వసియ్యత్ చేసిన వ్యక్తుల గురించి నేను చెప్పదలచిన ముఖ్యమైన విషయమేమనగా తమ చందాను సక్రమంగా చెల్లించుట దానిని భద్రపరచుట మూసి బాధ్యత. కాని మూసీల లెక్కలను పూర్తి చేయుట కేంద్ర కార్యాలయ లేదా సంబంధిత కార్యదర్శుల కర్తవ్యము. వారి చందా స్థితిగతుల గురించి అవసరమొచ్చినప్పుడు వారికి గుర్తు చేయించు చుండవలెను. జాతీయ స్థాయి అధికారులు ప్రాంతీయ స్థాయిలో గల జమాఅత్‌ల కార్యదర్శులను ప్రోత్సహించాలి. ప్రతి మూసి వారికి అందుబాటులో ఉండునట్లు ప్రణాళికలు రూపొందించుకోవాలి. కొన్ని సందర్భాలలో కొందరు మూసీలను గూర్చి నివేదికలు సమర్పించ వలసినదిగా కోరినప్పుడు, వారు తమ నివేదికలో ఫలాన మూసి ఇన్ని

సంవత్సరములుగా చందా వసియ్యత్ చెల్లించడం లేదని నివేదిక సమర్పిస్తారు. చందా చెల్లించనప్పుడు అతడు మూసి ఎలా అవుతాడని ప్రశ్నించినచో, పరిశీలించిన పిదప ఇందులో మూసి పొరపాటు ఏమియు లేదు, అతడు క్రమం తప్పకుండా చందా చెల్లించుచున్నాడు, కాని రికార్డు సిద్ధము చేయువారు సమగ్ర విషయములను పొందుపర్చనందున నివేదికలో పొరపాట్లు జరిగినవని సమాధానం ఇచ్చెదరు. ఒక వైపు ఇలాంటి నివేదికలు మూసీలను అనవసరంగా ఇబ్బందులకు గురిచేయగా, మరో వైపు జమాఅత్ వ్యవస్థ బలహీనతలు కూడ వీటి వలన బహిర్గత మగుతుంటాయి. నేటి కాలములో లెక్కలను భద్రపరచుటకు అత్యంత ఆధునిక సాధనాలు, పరికరాలు అందుబాటులో గలవు. కంప్యూటర్స్ కూడ ఉన్నాయి. లెక్కలలో పొరపాట్లు ఉండకూడదు. ప్రతి జాతీయ వసియ్యత్ కార్యదర్శి, ఆర్థిక కార్యదర్శి ఇరువురు తమ శాఖలకు చెందిన ప్రతి ఒక్క జమాఅత్ కార్యదర్శులను ఉత్సాహ వంతులుగా తీర్చిదిద్దవలెను. అదే విధముగా అమీర్‌లు, సదర్‌లు సమయానుకూలంగా వీరిపై దృష్టిని క్రేంద్రీకరించాలి. కేవలం చందా ప్రోగు చేసి, కేంద్రానికి నివేదికను పంపించడమే వారి భాధ్యత కాదు. వారు వ్యవస్థపైన పూర్తి విశ్వాసాన్ని కల్పించుచు, కేంద్రీయ, ప్రాంతీయ జమాఅత్‌ల మధ్య సత్సంబంధాలు నెలకొల్పి పటిష్టతను కల్పించుట కూడ సదర్, అమీర్‌ల భాధ్యతయే.

ముబల్లిఘీన్లు, మురబ్బీల గురించి కూడ నేనొక విషయము చెప్పదలచితిని. కొన్ని చోట్ల మురబ్బీల, ముబల్లిఘీన్ల సమావేశములు క్రమం తప్పకుండా జరగడం లేవు. ఈ సమావేశములు క్రమం తప్పకుండా నిర్వహించు బాధ్యత ముబల్లిఘ్ ఇన్‌చార్జులది. జమాఅత్ సంస్కరణ, ప్రచార కార్యములను కూడ పరిశీలించవలెను. ప్రయోజనకరమైన పనులను గురించి చర్చించుకోవలెను. ఆ విధానాలను అనుసరించునట్లు ఇతరులను కూడ ప్రోత్సహించాలి. అదే విధముగా జమాఅత్ కార్యదర్శులు జమాఅత్‌లకు ఆదేశించిన విషయములు, కేంద్ర ఆదేశము ప్రకారము జమాఅత్‌లకు పంపే విషయముల గూర్చి కూడ నివేదిక పంపవలెను. ఈ విషయములో కార్యదర్శులు ఉత్సాహవంతులుగా లేని ప్రతి

జమాఅత్‌లో ఎంత పని జరిగినదో మురబ్బీలు గమనించవలెను. ప్రత్యేకముగా ప్రచారము, సంస్కరణ, ఆర్థిక కార్యదర్శులు క్రియాశీలకంగా లేని చోట మురబ్బీలు, ముబల్లిఘీన్లు వారికి శ్రద్ధ కలిగించవలెను.

అల్లాహ్ తఆలా రాబోవు మూడు సంవత్సరముల కొరకు తమకు సేవ చేయు అవకాశము కలిగించినందున అధికాధికముగా పని చేయు అనుగ్రహము లభించుటకు పదవిదారులందరు దుఆ చేయవలెను. తమ ప్రతి మాట, కర్మతో జమాఅత్‌లో ఆదర్శముగా నిలుచువారగుదురు గాక!

*(ఆమీన్)*